క్లుప్తంగా

క్యాన్సర్ లక్షణాలపై సర్వే



ఇంటింటా వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యులు

దెందులూరు: 18 ఏళ్ల నిండిన మహిళలందరూ విధిగా స్క్రీనింగ్ టెస్టులు చేయించుకోవాలని గోపన్నపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ రాకేష్, డాక్టర్ రోజా అన్నారు. శనివారం క్యాన్సర్ లక్షణాలపై ఇంటింటా సర్వే కార్యక్రమాన్ని పరిశీలించారు. బీపీ, సుగర్, క్యాన్సర్, హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాధులకు సంబంధించి లక్షణాలు గుర్తించిన వెంటనే సమీప పీహెచ్ఎల్‌లో వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. సిబ్బంది ఇళ్లకు వచ్చినప్పుడు ప్రతి ఒక్కరూ వారికి పూర్తి వివరాలు తెలియజేసి సహకరించాలని వైద్యులు సూచించారు. ఎంపీహెచ్ఓ సత్యనారాయణ, వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

సంఘాల ఐక్యతతోనే ఆధ్యాత్మికాభివృద్ధి



ర్యాలీ నిర్వహిస్తున్న సాల్వేషన్ ఆర్మీ సంఘ సభ్యులు

దెందులూరు: సంఘాల ఏర్పాటు, నిర్వహణ, ఐక్యతతోనే ఆధ్యాత్మిక అభివృద్ధి, సమస్యలు పరిష్కారమవుతాయని సాల్వేషన్ ఆర్మీ దెందులూరు కోర్ ఆఫీసర్ కాకి రమణయ్య, కొవ్వలి కోర్ ఆఫీసర్ మేజర్ కే సుబ్బారావు అన్నారు. శనివారం కొవ్వలి, దెందులూరు, దోసపాడు, కంద్రి నరసింహపురంలో గృహ సమితి సభ్యుల ర్యాలీ నిర్వహించారు. అనంతరం ట్రాక్టర్లపై బ్యానర్లతో ఊరేగింపుగా ఏలూరు సాల్వేషన్ ఆర్మీ సెంట్రల్‌కు తరలివెళ్లారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్ ర్యాలీ



గణపవరంలో ప్రదర్శన చేస్తున్న స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థినులు

గణపవరం: విద్యార్థి దశలో క్రమశిక్షణకు, ధైర్య సాహసాలకు నిలమైన స్కౌట్స్ అండ్ గైడ్స్ ఎంతో ఉపయోగపడుతుందని గణపవరం బాలికోన్నత పాఠశాల హెచ్ఎం కె.బాలభాస్కరరావు అన్నారు. శనివారం పాఠశాలలో స్కౌట్స్ అండ్ గైడ్స్ పితామహుడు బాడెన్ పావెల్ జయంతి సందర్భంగా హెస్కూలు, హైస్కూలు ప్లస్ విద్యార్థినులు గణపవరంలో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ స్కౌట్స్‌లో సభ్యులైన విద్యార్థినులు జంతుప్రేమ కలిగి ఉండాలని, పబ్లిక్ ఆస్తులను కాపాడాలని ఇతరులకు సహాయపడే గుణం కలిగి ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా నినాదాలు చేస్తూ గణపవరంలో విద్యార్థినులు డ్రమ్ములు వాయిస్తూ ప్రదర్శన చేశారు. ప్రముఖ పర్యావరణ వేత్త అల్లూరి గంగరాజు, గైడ్ కెప్టెన్ పి.కల్యాణి తదితరులు పాల్గొన్నారు.


పంట బోదెలో పూడిక తొలగింపు



కైకరం తూర్పు వీధిలోని బోదెను శుభ్రం చేయిస్తున్న ఎంపీడీవో మనోజ్

ఉంగుటూరు: ప్రజలు ఫిర్యాదుతో ఎంపీడీవో రాజ్‌మనోజ్ శనివారం స్పందించారు. కైకరం తూర్పు వీధిలో ఉన్న పంట బోదెలో మురుగు పేరుకుపోయి దుర్గంధం వ్యాపిస్తోంది. దీనిపై స్థానికులు ఫిర్యాదు చేయడంతో ఎంపీడీవో ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. పూడిక తొలగింపు పనులు ప్రారంభించాలని పంచాయతీ పారిశుధ్య కార్మికులను ఆదేశించారు. దాంతో పంచాయతీ సిబ్బంది పూడిక తొలగించారు. దోమల నివారణ మందు పిచికారీ చేశారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ



పరీక్ష సామగ్రి పంపిణీ చేస్తున్న దాతలు

ఉంగుటూరు: హెల్పింగ్ హ్యాండ్స్ వెల్ఫేర్ సొసైటీ వారు బొల్లిన గంగరాజు జిల్లా పరిషత్ హైస్కూలు పూర్వ విద్యార్థి పుట్ట సత్యనారాయణ, సౌజన్యంతో బొమ్మిడి హైస్కూలు విద్యార్థులకు శనివారం పరీక్ష కిట్లను పంపిణీ చేశారు. ప్యాడ్లు, పెన్నులు అందజేశారు. ఈ సందర్భంగా దాతలను హెచ్ఎం శ్రీదేవి అభినందించారు. సొసైటీ అధ్యక్షుడు కావలిపరపు బాలకృష్ణ, సెక్రటరీ తిరుపతి ప్రసాదు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పటిష్ట ప్రణాళికతో.. మార్కులు పదిలం

- పబ్లిక్ పరీక్షల్లో సత్తా చాటేందుకు పదో తరగతి విద్యార్థులు సన్నద్ధం
- నూరు శాతం ఉత్తీర్ణత కోసం శ్రమిస్తున్న ఉపాధ్యాయులు
- పాఠశాలల్లో ఉదయం, సాయంత్రం అదనపు తరగతులు



పెదపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రత్యేక తరగతిలో చదువుకుంటున్న విద్యార్థులు

పెదపాడు: విద్యార్థి భవిష్యత్తుకు మైలు రాయి పదో తరగతి. పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఉత్తీర్ణత శాతం సాధించేందుకు ఉపాధ్యాయులు, విద్యార్థులు పూర్తిస్థాయిలో కృషి చేస్తున్నారు. ప్రతి పాఠశాలలో నూరు శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు పదో తరగతి విద్యార్థులను తీర్చిదిద్దుతున్నారు. వచ్చే నెల 17 నుంచి 31 వరకు పదో తరగతి పరీక్షలు నిర్వహించనున్నట్లు విద్యాశాఖ ముందుగానే ప్రకటించడంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు పూర్తిస్థాయిలో సన్నద్ధమవుతున్నారు.
వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు వ్యక్తిగత శ్రద్ధ తీసుకుని ఇంటికెళ్లి మరీ వారికి సెబ్జెక్టులోని సందేహాలను నివృత్తి చేస్తున్నారు. బాగా చదివేలా వారిని ప్రోత్సహిస్తున్నారు. సెలవు రోజుల్లోనూ ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు.మెరిట్ విద్యార్థులు మంచి మార్కులు సాధించేలా వెనుకబడిన విద్యార్థులు పాస్ మార్కులు సాధించేలా ఉపాధ్యాయులు కసరత్తులు చేస్తున్నారు. పెదపాడు మండలంలో గతేడాది కంటే ఈ ఏడాది ఎక్కువ శాతం ఫలితాలు సాధించే దిశగా అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు ఉదయం, సాయంత్రం వేళల్లో అదనపు తరగతులు నిర్వహిస్తున్నారని ఎంఈఓ సబ్బితి నర్సింహమూర్తి తెలిపారు. పెదపాడు మండలంలో 11 ప్రభుత్వ పాఠశాలల్లో 546 మంది, 8 ప్రైవేటు పాఠశాలల్లో 418 మంది పదో తరగతి విద్యార్థులున్నారు. వీరంతా పబ్లిక్ పరీక్షలు రాయనున్నారు.

అందమైన దస్తూరీతో అధిక మార్కులు



పద్య పాఠ్యాంశాలల్లో తేటగీతి, ఆటవెలది, కంద పద్యాలను (నీతి కలవి) చూసుకుంటే సరిపోతుంది. జవాబులను సంపూర్ణ వాక్యాలుగా రాయాలి. ప్రశ్నలను తయారు చేసేందుకు ప్రశ్నార్థక పదాలు (ఎవరు, ఎవరికి, ఏమిటి ఎలా, ఎందుకు) గుర్తుంచుకొని తయారు చేయాలి. పరిచిత గద్యానికి గద్యాంశ పాఠాలు, చూసుకోవాలి. సృజనాత్మకతలో పద్యభాగం నుంచి కవి పరిచయాలు, గద్య భాగం నుంచి నేపథ్య ప్రక్రియలు చదవాలి. అందమైన దస్తూరీతో మంచి మార్కులు సాధించవచ్చు.

– కొప్పుల రవి, తెలుగు ఉపాధ్యాయుడు, సత్యవోలు

నూరు శాతం ఫలితాలే లక్ష్యం



నూరు శాతం ఫలితాలు సాధించడమే లక్ష్యంగా పెట్టుకున్నాం. దీనికి అనుగుణంగా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. విద్యార్థులు ప్రశ్నపత్రాన్ని ఒకటికి రెండు సార్లు అర్థమయ్యే విధంగా చదువుకోవాలి. బట్టీ పట్టే విధంగా కాకుండా సమాచార నైపుణ్యం. సామర్థ్యంపై ఇచ్చిన పట్టికలు గ్రాఫ్‌లపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి. మ్యాప్ పాయింటింగ్, బిట్స్, ఒక మార్కు ప్రశ్నల ద్వారా అధిక మార్కులు సాధించవచ్చు.

– పి. వెంకటేశ్వరరావు, ప్రధానోపాధ్యాయుడు, పెదపాడు

గణితంలో సాధన చాలా ముఖ్యం



గణితంలో పూర్తి మార్కులు సాధించడానికి ప్రాక్టీసు చాలా ముఖ్యం చాలామంది గణితం అంటే భయపడతారు. సూత్రాలు, త్రిభుజాలను బాగా నేర్చుకోవాలి. అంకమధ్యమం, మధ్యగతం, బాహుళకం విభాగాలను బాగా సాధన చేస్తే సులభంగా స్కోరు వస్తుంది. గణిత పుస్తకంలో ఉండే 14 చాప్టర్ల నుంచి 8 లేక 9 చాప్టర్లను సులభ పద్ధతిలో రివిజన్ చేయడం శ్రేయస్కరం.

– ఆదినారాయణ, గణిత ఉపాధ్యాయుడు, సత్యవోలు

అర్థమయ్యేలా రాస్తే అధిక మార్కులు

నూతన పాఠ్యపుస్తకాల ఆధారంగా తొలిసారి నిర్వహిస్తున్న పరీక్షల్లో జనరల్ సైన్స్ పేపర్-1 భౌతిక రసాయన శాస్త్రం 50 మార్కులకు ఉంటుంది. దీనిలో మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావడం తేలిక, ఎక్కువ ప్రశ్నలు వచ్చే పాఠ్యాంశాలను ఉపాధ్యాయుల ద్వారా తెలుసుకుని వాటిని బాగా చదవాలి. జవాబులు రాసేటప్పుడు క్రమపద్ధతి పాటించాలి. అందంగా జవాబులు రాస్తే పూర్తి మార్కులు సాధించవచ్చు

– దీప్తి, ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయురాలు, పెదపాడు

ఆంగ్లంపై అవగాహన అవసరం



ఆంగ్ల పరీక్ష ఒకే పేపరు 100 మార్కులకు ఉంటుంది. సెక్షన్ ఏలో రీడింగ్, కాంప్రహెన్షన్, సెక్షన్ సీ క్రియేటివ్ ఎక్స్‌ప్రెషన్లకు ఒక్కో దానికి కలిపి 30 చొప్పున 60 మార్కులకు ఉంటాయి. సెక్షన్ బీలో వకాబులరీ, గ్రామర్ కలిపి 40 మార్కులకు ఉంటాయి. వీటిని ఉపాధ్యాయుల సహాయంతో సాధన చేయాలి. క్రియేటివ్ రైటింగ్‌లో లెటర్, డైరీ, డైలాగ్ పేరా గ్రాఫ్, ప్రశ్నల రూపకల్పన డేటా అనాలసిస్ వర్ణన అంశాలకు సంబంధించి సొంతంగా జవాబు రాసేలా సాధన చేయాలి.

– యూవీ సత్యనారాయణ, ఆంగ్ల ఉపాధ్యాయుడు, జెడ్పీ ఉన్నత పాఠశాల, పెదపాడు

హిందీ ప్రశ్నపత్రంలో ఆరు భాగాలు



హిందీ ప్రశ్నపత్రంలో మొత్తం ఆరు భాగాలుంటాయి. ఇందులో ఉపవాచకం, పద్య, గద్య భాగం, అవర విభాగం ఉంటాయి. మొదటి భాగంలో 12 ప్రశ్నలు వ్యాకరణానికి సంబంధించినవి కాగా సరళమైన వ్యాకరణాలు నేర్చుకుని, పట్టిక తయా రు చేసుకోవాలి. 2వ భాగం ప్రశ్నల్లోని కీలక పదాన్ని ప్యాసేజీలో వెతికి సమాధానం గుర్తించవచ్చు. 3వ భాగం కవి పరిచయాల్లో కబీర్‌దాసు, మీరాబాయి నేర్చుకుంటే సరిపోతుంది. 4వ భాగంలోని 8 ప్రశ్నల్లో ఆరుంటికి సమాధానాలు నాలుగు వాక్యాల్లో రాయాలి.

– చిల్లా అనూరాధ, హిందీ స్కూల్ అసిస్టెంట్, జెడ్పీ హైస్కూలు గొల్లగూడెం

ప్రశ్నను అర్థం చేసుకోవాలి

ప్రశ్నాపత్రం ఒకటే అయినప్పటికీ జవాబు పత్రాలు భౌతిక శాస్త్రం, జీవశాస్త్రం వేర్వేరుగా ఇస్తారు. ఇందులో జీవన విధానాలు(విసర్జన) నియంత్రణ, సమన్వయం, ప్రత్యుత్పత్తి పటాలను (బొమ్మలు) సాధన చేయాలి. దీంతోపాటు పట్టికలు పేరాగ్రాఫ్‌ల రూపంలో ఉన్న అంశాలను బాగా చదివి తర్వాత సంబంధిత మాదిరి ప్రశ్నలకు సమాధానాలు రాయడం సాధన చేయాలి. ప్రయోగాలు, కృత్యాలు పేరాలు, బేధాలు, రాయడం వంటి అంశాలను అవగాహనతోనే అధ్యయనం చేయాలి.

– వాసవి, జీవశాస్త్రం ఉపాధ్యాయురాలు, సత్యవోలు

వైఎస్సార్‌సీపీ మరింత బలోపేతం



మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, సునీల్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన మాజీ ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

దెందులూరు: వైఎస్సార్‌సీపీ గ్రామ, పట్టణ ప్రాంతాల్లో మరింత బలోపేతం అవుతోందని రాష్ట్ర మాజీ మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరావు అన్నారు. శనివారం దెందులూరు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి, రాష్ట్ర మాజీ మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరావు, వైఎస్సార్‌సీపీ ఏలూరు పార్లమెంట్ సమన్వయకర్త కారుమూరి సునీల్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా వారి నివాసంలో కలిశారు. దెందులూరు నియోజకవర్గంలో పరిస్థితులను, పార్టీ శ్రేణులపై దాడులు, దౌర్జన్యాలు, అక్రమ కేసుల నమోదు తదితర అంశాలను వివరించారు.

బుక్ డిపాజిట్ సెంటర్లను ఏర్పాటు చేయాలి

దెందులూరు: గోపన్నపాలెంలో గ్రంథాలయం, మెట్ట ప్రాంత గ్రామాల్లో బుక్ డిపాజిట్ సెంటర్లను ఏర్పాటు చేయాలని మండల ప్రజలు చదువులు కోరుతున్నారు. గోపన్నపాలెంలో 10 గ్రామాలకు సెంటర్‌గా ఉంది. ఎన్నో ఏళ్ల నుంచి దాత స్థలం భవనం ఇచ్చి గ్రంథాలయం ఏర్పాటు చేశారు. ఏదొక కారణాల వల్ల భవనం శిథిలావస్థకు చేరి పుస్తకాలు, పేపర్లు తడిచిపోయి గోపన్నపాలెం గ్రంథాలయాన్ని తీసివేశారు. మెట్ట గ్రామాల్లో సెంటర్‌గా ఉన్న రామారావుగూడెంలో డిపాజిట్ సెంటర్‌ను జిల్లా గ్రంథాలయ సంస్థ కథకు నేడు కిందట ఏర్పాటు చేసింది. మరి ఎందుకు ఆ బుక్ డిపాజిట్ సెంటర్ సైతం రద్దు చేసింది. రామారావుగూడెంలో ఒక గ్రామంలోనైనా డిపాజిట్ సెంటర్ ఏర్పాటు చేస్తే ఏడు నుంచి ఎనిమిది గ్రామాల ప్రజలకు పత్రికలు, పుస్తకాలు రోజు చదువుకునే వెసులుబాటు కలుగుతుందని పలువురు ముక్తకంఠంతో కోరుతున్నారు 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ, పీజీ, ఐటీఐ, బీఎల్, బీఈడీ, టీటీసీ, నర్సింగ్ ల్యాబ్ ఇలా వేలాది మంది విద్యనభ్యసించి ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న వారు గ్రంథాలయ సౌకర్యం లేక తీవ్ర సౌకర్యానికి గురవుతున్నారు. గోపన్నపాలెంలో గ్రంథాలయం రామారావు గూడెంలో బుక్స్ డిపాజిట్ సెంటర్ ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

చెత్త నుంచి సంపద సృష్టించాలి



గుండుగొలనులో మహిళలకు కరపత్రాన్ని అందిస్తున్న ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి



భోగాపురంలో పొడి, తడి చెత్త డబ్బాలను అందిస్తున్న ఈవోఆర్‌డీ ఏ.సుందరి

భీమడోలు: చెత్తను పంచాయతీలు ఆదాయ వనరులుగా మార్చుకుని ఆర్థిక స్వావలంబన సాధించాలని భీమడోలు ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి అన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు రెండు రోజుల ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాల నిర్వహణ డ్రైవ్‌లో భాగంగా తొలి రోజైన శనివారం మండలంలోని గ్రామ పంచాయతీల్లో తడి, పొడి చెత్తల సేకరణ కార్యక్రమాలను నిర్వహించారు. గుండుగొలను పంచాయతీ పరిధిలోని గుండుగొలను, భోగాపురంలో భీమడోలు ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి పర్యటించిన పారిశుధ్య కార్యక్రమాల అమలును పరిశీలించారు. తడి, పొడి చెత్తలను వేర్వేరు డస్ట్ బిన్లలో ఉంచే విధానానంపై మహిళలకు అవగాహన కల్పించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటింటి నుంచి సేకరించిన చెత్తను చెత్త నుంచి సంపద కేంద్రానికి తరలించి వాటిని సిబ్బంది వేర్వేరుగా తొట్టెల్లో ఉంచాలన్నారు. తడి చెత్త నుంచి సేంద్రియ ఎరువును తయారీ చేయాలని, పొడి చెత్తలను ప్రతి గురువారం విక్రయించి వచ్చిన ఆదాయాన్ని పంచాయతీలకు జమచేసుకోవాలన్నారు. ప్లాస్టిక్‌ను నిర్మూలించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోడాలని కోరారు. ఈవోఆర్‌డీ ఏ.సుందరి, పంచాయతీ కార్యదర్శులు, డ్వాక్రా సంఘాల సభ్యులు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

అంకితభావంతో పని చేస్తే గుర్తింపు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఉపాధ్యాయులు

దెందులూరు: అంకితభావంతో పని చేస్తే ఏ రంగంలోనైనా గుర్తింపు వస్తుందని కొవ్వలి ఉన్నత పాఠశాల హెచ్ఎం ఎస్ఎల్ఎన్‌వీజీ శర్మ అన్నారు. శనివారం కొవ్వలి ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న దెందులూరు నియోజకవర్గ గ్రిక్ స్పోర్ట్స్ గేమ్స్ ముగిశాయి. విజేతలకు పాఠశాల ఫిజికల్ డైరెక్టర్లు జక్కుల సురేష్ కుమార్, గవ్వ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు బహుమతులను అందజేశారు.

విజేతల వివరాలు: బాలుర విభాగంలో కబడ్డీలో విజేతగా మాదేపల్లి జెడ్పీహెచ్ఎస్ జట్టు, రన్నర్స్‌గా పోతునూరు జెడ్పీహెచ్ఎస్ జట్టు నిలిచింది. కోకోలో అప్పనవీడు జెడ్పీహెచ్ఎస్ జట్టు విజేతలుగా, పోతునూరు జెడ్పీహెచ్ఎస్ జట్టు రన్నర్స్‌గా నిలిచింది. వాలీబాల్ పోటీల్లో కొవ్వలి జెడ్పీహెచ్ఎస్ జట్టు విజేతలుగా, గుడివాకలంక జెడ్పీహెచ్ఎస్ జట్టు రన్నర్స్‌గా నిలిచింది. త్రోబాల్‌లో విజేతగా కొప్పాక జెడ్పీహెచ్ఎస్ జట్టు, రామసింగవరం జెడ్పీహెచ్ఎస్ జట్టు రన్నర్స్‌గా నిలిచింది.

బాలికల విజేతలు: వాలీబాల్‌లో విజేతలుగా మేధినరావుపాలెం జెడ్పీహెచ్ఎస్ జట్టు, రన్నర్స్‌గా చాటపర్రు జెడ్పీహెచ్ఎస్ జట్టు నిలిచింది. త్రోబాల్‌లో విజేతలుగా కొప్పాక జెడ్పీహెచ్ఎస్ జట్టు, రన్నర్స్‌గా రామశింగవరం జెడ్పీహెచ్ఎస్ జట్టు విజేతలు నిలిచింది. కబడ్డీలో విజేతలుగా కలపర్రు జెడ్పీహెచ్ఎస్ జట్టు, రన్నరర్స్‌గా వీరమ్మకుంట జెడ్పీహెచ్ఎస్ జట్టు, ఖోఖోలో విజేతలుగా వంగూరు జెడ్పీహెచ్ఎస్ జట్టు, రన్నర్స్‌గా కలపర్రు జెడ్పీహెచ్ఎస్ జట్టు నిలిచింది.

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్ల పరిశీలన



పోలింగ్ స్టేషన్లను తనిఖీ చేస్తున్న తహసీల్దార్ సుమతి

దెందులూరు: ఎమ్మెల్సీ ఎన్నికలకు దెందులూరు మండలంలో 2,197 ఓట్లు ఖరారయ్యాయని తహసీల్దార్ బి.సుమతి అన్నారు. శనివారం దెందులూరులోని మూడు పోలింగ్ స్టేషన్లను ఆమె తనిఖీ చేశారు. అన్ని సౌకర్యాలు పరిశీలించారు. నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామన్నారు ఎన్నికల కమిషన్ ఫైనల్ లిస్ట్ శనివారానికి 2,197 ఓట్లు దెందులూరు మండలంలో నిర్ధారణ అయ్యాయన్నారు. తహసీల్దార్ వెంట ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ కృష్ణస్వామి, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ హేమమాలిని, దెందులూరు వీఆర్‌ఓ శ్రీను, దెందులూరు హైస్కూల్ హెచ్ఎం మల్లికార్జునరావు ఉన్నారు.

ఆయుర్వేద వైద్యశిబిరం

ఉంగుటూరు: ఉంగుటూరు ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల ఆధ్వర్యంలో నీలాద్రిపురంలో ఉచిత ఆయుర్వేద వైద్యశిబిరం శనివారం నిర్వహించారు. ఈశిబిరంలో వైద్యశాల డాక్టర్ శిరీష గ్రామంలోని రోగులను పరీక్షించి మందులు ఉచితంగా అందజేశారు. వైద్య సిబ్బంది పి.కృష్ణకుమారి, మంగన్న, దుర్గ, నాగరాజు పాల్గొన్నారు.

గర్భిణుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి



గణపవరం పీహెచ్‌సీలో వైద్యసిబ్బందికి సూచనలిస్తున్న వైద్యాధికారి

గణపవరం: ప్రభుత్వం ఏర్పాటు చేసిన రిచ్ పోర్టల్‌లో ఆన్‌లైన్‌లో గర్భిణుల వివరాలను నూరు శాతం నమోదు చేయాలని గణపవరం పీహెచ్‌సీ వైద్యాధికారులు పులపర్తి సంతోష్, పి.కిరణ్మయి అన్నారు. గర్భిణలకు ఐరన్, టీడీ వ్యాక్సిన్లు సకాలంలో అందించి పోర్టల్‌లో అప్‌లోడు చేయాలని వారన్నారు. శనివారం పీహెచ్‌సీలో వైద్య సిబ్బందికి వారు పలు సూచనలు ఇచ్చారు. మార్చి 3 నుంచి 8వ తేదీ వరకూ రూబెల్లా వ్యాక్సిన్‌పై ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఎన్‌సీడీ స్క్రీనింగ్ ప్రతి రోజూ 2 శాతం పెరగాలని తెలిపారు. ప్రతి నెల పీహెచ్‌సీలో కనీసం ఐదు ప్రసవాలు నమోదు కావాలని అన్నారు. ఈడీడీ ఉన్న గర్భిణులను పీహెచ్‌సీకి తీసుకురావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో జాలాది విల్సన్, మిడ్‌లెవెల్ హెల్త్ ప్రొవైడర్లు, ఆశా వర్కర్లు, ఆరోగ్య సహాయకులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

ఉంగుటూరు: కాగుపాడు పరిధిలోని రావులపర్రులో శనివారం డ్రైడేపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కాగుపాడు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డాక్టర్ పి.మానస, మలేరియా సబ్‌యూనిట్ అధికారి వైవీ లక్ష్మణరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ దోమలు వృద్ధి చెందే ప్రదేశాలను గుర్తించి వాటిని నిర్వీర్యం చేయాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఫ్రైడే డ్రైడే పాటించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని కోరారు. ఆరోగ్య విస్తరణాధికారి కె.శ్రీనివాసరావు, పర్యవేక్షకులు సత్యనారాయణ, ఆరోగ్య కార్యదర్శి శాంతిప్రియ ఉన్నారు.

టెన్త్, ఇంటర్ విద్యార్థులకు ఆత్మీయ వీడ్కోలు

భీమడోలు: భీమడోలు పాలేటి స్కూలు ప్రాంగణంలో శనివారం టెన్త్ విద్యార్థులు, మాధురి జూనియర్ కళాశాల ఇంటర్ విద్యార్థులకు ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు సహచర విద్యార్థులకు వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా యువతీ యువకుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి మాంటిస్సోరి విద్యాసంస్థల చైర్మన్ కె. ప్రేమ్‌కుమార్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు పాల్గొన్నారు. టీచర్లు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

క్షయవ్యాధిపై అవగాహన అవసరం



కాశిపాడులో క్షయవ్యాధిపై అవగాహన ప్రదర్శనలో పాల్గొన్న వైద్య సిబ్బంది

గణపవరం: క్షయవ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, క్షయవ్యాధిని సకాలంలో గుర్తిస్తే పూర్తిగా నివారించవచ్చని జిల్లా పీఎంపీ అసోసియేషన్ అధ్యక్షుడు ఏఆర్‌కే పరమేశ్వర్లు అన్నారు. శనివారం గణపవరం మండలం కాశిపాడులో పీఎంపీ అసోసియేషన్, వైద్యశాఖల ఆధ్వర్యంలో ప్రపంచ క్షయనివారణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ప్రదర్శన నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. వారం రోజులకు మించి దగ్గు, జ్వరం సాయంత్రం జ్వరం, ఆకలి తగ్గడం, బరువు తగ్గడం వంటి లక్షణాలు ఉంటే వెంటనే పీహెచ్‌సీలో క్లె పరీక్షలు చేయించుకోవాలని అన్నారు. క్షయ వ్యాధి నిర్ధారణ అయితే ఉచితంగా వైద్యం అందిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా అమ్మవార్ల సంబరం



భీమడోలులో అమ్మవార్ల ఆలయాల వద్ద సంబరంలో నృత్యాలు చేస్తున్న భక్తులు



ఉత్సవాలకు హాజరైన భక్తులు

భీమడోలు: భీమడోలులో 12 ఏళ్లకు వచ్చే జాతర మహోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో గ్రామదేవతలుగా విరాజిల్లుతున్న మద్దిరామమ్మ, మహాలక్ష్మమ్మ, గంగానమ్మ, పోతురాజు జాతర ఈ నెల 7వ తేదీ నుంచి కన్నుల పండుగగా నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి భీమడోలులోని ఆలయాల ప్రాంగణం వద్ద మద్దిరామమ్మ సంబరాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. మేళ తాళాల నడుమ గణాచారులు ఆడి పాడారు. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు భారీ సంఖ్యలో తరలి వచ్చి సంబరాన్ని తిలకించారు. దీనితో అక్కడ పండుగ వాతావరణం నెలకొంది. అమ్మవారికి గణాచారులు, భక్తులు పెద్ద ఎత్తున జేజేలు పలికారు. తొలుత భీమడోలు సత్యసాయి సేవా సమితి సభ్యులు అమ్మవార్లకు సారెను సమర్పించారు. జాతర కమిటీ అధ్యక్షుడు దత్తాడ శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఎటువంటి అవాంఛనీయ సంఘటలను జరగకుండా ఎస్సై వై.సుధాకర్ నేతృత్వంలో పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేసారు. శనివారం భీమడోలులోని అమ్మవార్లను ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు దర్శించుకున్నారు. వారికి ఆలయ కమిటీ నిర్వాహకులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. ముగ్గురమ్మలను వారు దర్శించుకుని పూజలు చేసారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు దత్తాడ శ్రీనివాసరాజు, సభ్యులు ఎంపీని దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జాతర కమిటీ పెద్దలు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

చిన్నారుల సమగ్రాభివృద్ధి లక్ష్యంగా కృషి చేయాలి



భీమడోలులో టీఎల్‌ఎంలను ప్రదర్శిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, డీఆర్పీలు, సూపర్‌వైజర్లు

భీమడోలు: అంగన్‌వాడీల్లోని ప్రీ స్కూలు చిన్నారుల సమగ్రాభివృద్ధి లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలని డీఆర్పీలు ఎం.శరీన్, గోపాలకృష్ణ కోరారు. భీమడోలు జెడ్పీ ఉన్నత పాఠశాలలో జ్ఞానజ్యోతి రెండవ దఫా కార్యక్రమంలో భాగంగా తొలి రోజు శనివారం శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. చిన్నారుల్లో సామాజిక, భావోద్వేగ అభివృద్ధి, శరీరకాభివృద్ధి, మేధాభివృద్ధి, భాష, అక్షరాస్యత అభివృద్ధిని సాధించేందుకు అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ అందించారు. ఈ సందర్భంగా మండలంలోని 53 మంది అంగన్‌వాడీ కార్యకర్తలు బృందాలుగా ఏర్పడి టీఎల్‌ఎంలను తయారు చేసారు. కేంద్రాల్లో ఆట పాటలతో కూడిన విద్యాబోధనను అందించే తీరును కార్యకర్తలు వివరించారు. ఈ సందర్భంగా డీఆర్‌పీలు ఎం.శరీన్; గోపాలకృష్ణ మాట్లాడుతూ 2020 నూతన విద్యా విధానంలో అంగన్‌వాడీ వ్యవస్థను బలోపేతం చేసే లక్ష్యంగా జ్ఞానజ్యోతి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.శిక్షణ అనంతరం కార్యకర్తలకు ధ్రువీకరణ పత్రాలను అందిస్తామన్నారు. చిన్నారుల్లో సృజనాత్మకత విలువలను పెంపొందించేందుకు ఈ శిక్షణ ఎంతగానో దోహద పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కోర్సు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు, సూపర్‌వైజర్లు నూర్జహాన్, ఎం.కవిత, సీఆర్‌పీలు ఎన్‌వీ సత్యప్రసాద్, సీహెచ్ రమణ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తలకు జ్ఞాన జ్యోతి శిక్షణ

ఉంగుటూరు: స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్లో అంగన్‌వాడీ కార్యకర్తలకు జ్ఞాన జ్యోతి శిక్షణ కార్యక్రమం శనివారం నిర్వహించారు. గ్రూపు-1 లీడర్ డి.వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో నాన్న.. పులి కథను ప్రదర్శించారు. రిసోర్సుపర్సన్ అల్లు శ్రీను పులిగా అభినయం చేసి అబ్బురపరిచారు. ఆర్పీలు శిరికి శివ, యు.శివకుమార్, బి. శ్రీలక్ష్మి, శారదామణి తదితరులు అల్లు శ్రీనుని అభినందించారు.